ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
బుధవారం 1 జనవరి 2025





వికారాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో...



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

» జిల్లా నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి ప్రతీ ప్రిన్సిపాల్ కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎస్.శంకర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ యాజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలు నిర్వహించే ప్రాక్టికల్, థియరీ పరీక్ష కేంద్రాలలో కనీస మౌలిక వసతులైన ఫ్యాన్స్, ట్యూబ్ లైట్స్, కంప్యూటర్, ప్రింటర్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా వార్షిక పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని రానున్న వార్షిక పరీక్షలను సైతం విజయవంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. విద్యార్థులు పరీక్ష ఒత్తిడిని అధిగమించేలా మెడిటేషన్‌కార్యక్రమాలునిర్వహించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అత్యధిక పాస్ పర్సంటేజ్‌సాధించడానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రూపా లక్ష్మి, నర్సింహారెడ్డి, సురేశ్వర స్వామి, బుచ్చిరెడ్డి, కుమారస్వామి, వెంకటేశ్వర రావు, నర్సిములు, మూసాఖాన్, బస్వరాజ్, ముజీబ్, అంజయ్య వివిధ కళాశాలల యాజమానాలు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

ఘట్‌కేసర్‌రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతికి ప్రవేశాలకు నిర్వహించే పరీక్షల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జోనల్ అధికారి నిర్మల, ప్రిన్సిపల్ వేణుగోపాల్ మంగళవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జనరల్ విద్యార్థులకు 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షలకు నేటి నుంచి ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్‌లో రూ.100ల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 23న రాతపరీక్ష ఉంటుందన్నారు.



ఓ రిసార్ట్‌లో న్యూ ఇయర్ వేడుకలు

గ్రాండ్ వెల్‌కమ్

2025

ధూంధాంగా న్యూఇయర్ వేడుకలు

కొంగొత్త ఆశలు, శతకోటి ఆకాంక్షలతో స్వాగతం
కిక్కిరిసిన రిసార్ట్‌లు, పబ్బులు, స్టార్ హోటళ్లు
జిల్లాలో జోరుగా మద్యం, మాంసం విక్రయాలు
సందర్శకులతో కళకళలాడిన అనంతగిరి పర్యాటక కేంద్రం
బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్న యువత
జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సాగిన పోలీసుల తనిఖీలు

జిల్లా ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి ఉల్లాసంగా ఉత్సాహంగా స్వాగతం పలికారు. డిసెంబర్ 31 సందర్భంగా చిన్నాపెద్ద తేడా లేకుండా విందు వినోదాల్లో మునిగి తేలారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే నూతన సంవత్సరానికి స్వాగతమంటూ ఆనందోత్సాహాలతో ఎగిరి గంతేశారు. కేక్ కటింగ్‌లు చేసి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వికారాబాద్/మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్, మేడ్చల్, తాండూరు, పరిగి, కొడంగల్ తదితర ప్రాంతాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల కోసం రిసార్ట్స్‌ను అందంగా అలంకరించారు. బేకరీలు, స్వీట్‌షాపులు, బ్రేవరీస్, మాంసం షాపులు కొనుగోలుదారులతో నిండిపోయాయి. ఫాంహౌస్‌లు, ప్రత్యేక స్థలాల్లోనూ పర్యాటకులతో కిటకిటలాడాయి. హోటళ్లలో ప్రత్యేకంగా చేసిన వంటకాలను తెప్పించుకుని రుచులను ఆస్వాదించారు. ఎవరికి వారు బృందాలుగా విడిపోయి నూతన సంవత్సరం

మిగతా 8వ పేజీలో...





వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ | మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

నూతన సంవత్సర శుభాకాంక్షలు

వికారాబాద్, మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, ఆశల, ఆశయాలతో ముందుకు సాగాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అభిలాషించారు. అలాగే తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వారు బొకేలు, పుష్పగుచ్ఛాలు తీసుకురావద్దని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వాటి స్థానంలో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్లాంకెట్స్ విద్యార్థులకు ఉపయోగపడే ఇతర సామగ్రి తీసుకురావాలని సూచించారు. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



మేడ్చల్‌లో రంగుల దుకాణం వద్ద మహిళలు

రెచ్చిపోతున్న ఎర్రమట్టి దొంగలు

మైనింగ్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
అదే రాత్రి మళ్లీ విచ్చలవిడిగా తవ్వకాలు
అధికారుల పనితీరుపై అనుమానాలు
ముడుపులు ఇస్తామంటున్న ఎర్రమట్టి ముఠా



అర్ధరాత్రి సాగుతున్న మట్టి తవ్వకం

వికారాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టి దొంగలు రెచ్చిపోతున్నారు. ఎన్ని వార్తా కథనాలు వచ్చినా, వాహనాలు సీజ్ అయినా మా పని మేము చేస్తామన్నట్లు అర్ధరాత్రి అయితే చాలు వికారాబాద్ మున్సిపాలిటీ, మండలంలో ఏదో ఒక చోట మట్టిని తవ్వేస్తున్నారు. 'తోడేస్తున్నారు' శీర్షికన వార్త కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వెంటనే మైనింగ్ ఏడీ, ఆర్‌ఐలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు పరిశీలించిన అదే రాత్రి మళ్లీ ఎర్రమట్టి దొంగలు అక్రమ వ్యాపారానికి తెరలేపారు. దీంతో అధికారులు పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దృష్టి సారించాలి

పాతూరు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగించారు. రాత్రి 11 గంటల సమయంలో తవ్వకాలు జరుగుతున్నాయని జేసీబీ ఫొటోలు, మట్టి తరలించే వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం జరిగినా అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. పత్రికల్లో వచ్చే కథనాల ద్వారా ఈ విషయాలను అధికారులకు తెలిసినా వారి వద్ద కాసులకు చేతులు చాపుతున్నారని జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. జేసీబీలు, టిప్పర్లు సీజ్ చేసినా వాటికి ఎంతో కొంత డబ్బు చెల్లిస్తే వాహనాలు విడిచి పెడుతున్నారని వ్యాపారులే బహిరంగంగా చెబుతుండటం గమనార్హం. మైనింగ్ కార్యాలయంలో తాండూరులో ఉండడం డివిజన్ వారీగా అధికారులు లేక పోవడంతో తాము ఏం చేస్తామనే తీరులోని వ్యవహరిస్తున్నారు. మైనింగ్ అధికారులకు సైతం పెద్దమొత్తంలో ముడుపులు ముట్టడంతోనే ఈ విధంగా ఎర్రమట్టి వ్యాపారం విచ్చలవిడిగా మారిందని బహిరంగగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, కలెక్టర్ ఎర్రమట్టి వ్యాపారులపై ఉక్కుపాదం మోపి వాహనాలు పూర్తి స్థాయిలో సీజ్ చేసి, వ్యాపారులపైకేసులు నమోదు చేయాలని ప్రజలు పేర్కొంటున్నారు.

లక్ష ఎకరాలకు సాగునీరు
అందిస్తాం

ప్రభుత్వం మారడంతో ఆగిన 'ప్రాణహిత' 6
పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
వరి పరిశోధనా సంస్థలో ప్రపంచ నేలల దినోత్సవం



ముంబై రైళ్లకు అదనపు బోగీలు

కొత్త ఏడాదిలో అమలు 6
రేపటి నుంచి అదనపు కోచ్‌లు
తీరనున్న ప్రయాణికుల అవస్థలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పక్కా భవనాలు



గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం
అత్యాధునికంగా కార్పొరేట్ తరహాలో నిర్మాణాలు
గచ్చిబౌలి, ఫోర్త్‌సిటీ, ఉప్పల్‌లో తొలిదశ నిర్మాణాలు
వచ్చే నెలలోనే శంకుస్థాపనలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : కొత్త ఏడాది ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులకు తీపికబురు తెలిపింది. ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవన నిర్మాణాలకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలివిడతలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అత్యాధునిక రీతిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. వచ్చే నెలలోనే వీటి నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు దశలవారీగా కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు నిర్మిస్తామని తెలిపారు. మొదటి దశలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. వాస్తవానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు రాష్ట్రంలోనే సింహభాగం ఆదాయం ఉమ్మడి జిల్లా నుంచే అందుతుంది. కానీ ఇప్పటివరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు

మిగతా 6వ పేజీలో...



మైల్వార్ రిజర్వు ఫారెస్టులో కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

చెక్‌డ్యాం, కాల్వలకు మరమ్మతులు

» సర్వే నిర్వహించిన ఇరిగేషన్, అటవీశాఖ అధికారులు

బషీరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నీళ్లపల్లి- మైల్వార్ రిజర్వు ఫారెస్టులోని చెక్‌డ్యాం, కాల్వ మరమ్మతుల కోసం ఇరిగేషన్, అటవీశాఖ అధికారులు మంగళవారం జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో తాండూరు ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్య, ఏఈ చందనరెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ అధికారిణి స్నేహశ్రీ, బీట్ అధికారి మల్లయ్య సిబ్బంది అటవీ ప్రాంతలోని చెక్‌డ్యాం, కిలోమీటరు మేరకు ఉన్న రాందేవుని కాల్వను పరిశీలించారు. చెక్‌డ్యాం శిథిలావస్థకు చేరి కాల్వ పూడుకుపోయి అక్కలమ్మ, ఎల్లమ్మ చెరువులు నిండటం లేదని కాంగ్రెస్ నాయకులు బిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఇటీవల ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆయా శాఖల అధికారులు సర్వే చేశారు. ఎక్కడెక్కడా పనులు చేపట్టాలనే దానిపై వివరాలు నమోదు చేసుకున్నారు. అటవీశాఖ అనుమతులతో పాటు సమగ్ర నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. వీరి వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, రైతులు పలువురు ఉన్నారు.

4,230 కేసులు నమోదు

386 కేసుల్లో నిందితులకు శిక్ష.. ఐదుగురికి జీవిత ఖైదు

డయల్ 100కు 31,255 ఫోన్ కాల్స్
దొంగతనం కేసుల్లో 54శాతం రికవరీ
మహిళలపై స్వల్పంగా పెరిగిన అఘాయిత్యాలు
రోడ్డు ప్రమాదాల్లో తగ్గిన మృతుల సంఖ్య
జిల్లా వ్యాప్తంగా 545 సీసీ కెమెరాల ఏర్పాటు
335 మంది బాలకార్మికులను కాపాడాం
గతేడాది జిల్లాలో జరిగిన నేరాల వివరాలను వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణనే ప్రధాన లక్ష్యంగా మెరుగైన పోలీసింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో కేసుల సంఖ్య పెరిగినా... రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గిందన్నారు. 2024లో సంవత్సరంలో జిల్లాలో చోటుచేసుకున్న నేర సంఘటనల గురించి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఆయనతో పాటు ఏఎస్పీ హన్మంతరావు హాజరయ్యారు.

సీసీఎస్ పోలీసుల సహకారంతో..

2023లో 3,600 కేసులు నమోదు కాగా, 2024లో 4,230 కేసులు నమోదయ్యాయని చెప్పారు. మహిళలపై అఘాయిత్యాల సంఖ్య పెరిగిందని, గతేడాదితో పోలిస్తే 35 కేసులు పెరిగాయన్నారు. 72 కిడ్నాప్, 64 అత్యాచార సంఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. గతంతో పోలిస్తే దొంగతనాలు పెరిగినా, సీసీఎస్ పోలీసుల సహకారంతో ఆ కేసులను ఛేదించగలిగామన్నారు. రూ.1,78,37,204 విలువ గల ఆస్తులు దొంగతనానికి గురవగా, రూ.96,14,918 విలువైన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోగలిగామన్నారు. 54 శాతం రికవరీ ఉందన్నారు. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల గతంలో కంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయని చెప్పారు. మట్కా, గాంబ్లింగ్‌కు

మిగతా 8వ పేజీలో...





అమరులకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

వికారాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సమక్ష శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం వికారాబాద్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. అనంతరం మానవ హారం నిర్వహించారు. సమగ్ర శిక్షాను విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, యంఐఎం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రవికుమార్, స్వరూప, స్రవంతి, రాధిక, పల్లవి, రఘుసింగ్, రఘు, ప్రశాంత్, వెంకట్‌రెడ్డి, దశరథ్, మాధవి, రవి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు

పక్కా భవనాలు

(5వ పేజీ తరువాయి)

లేక అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ సమస్య తీరనుంది. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు గండిపేట, శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కలిపి గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించనున్నారు గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్)లో అత్యాధునిక రీతిలో మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అన్ని హంగులతో నిర్మించాలని నిర్ణయించారు. అలాగే మేడ్చల్ జిల్లా పరిధిలో కుత్బుల్లాపూర్, ఉప్పల్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఉప్పల్‌లో నిర్మించనున్నారు. కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫ్యూచర్ సిటీలో నిర్మించనున్నారు. మొదటి దశలో నిర్మించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కనీసం మూడు ఎకరాల్లో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 10 నుంచి 15వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం చేపడుతున్నారు. వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయాలు, విశాలమైన పార్కింగ్ వంటి వసతులు ఉండేలా డిజైన్ రూపొందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక రీతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలను సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ కూడా చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రకారం పనిభారం ఎక్కువగా ఉన్నచోట్ల కొత్తగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. దీని ప్రకారం నగర శివార్లలో మరి కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి.

ముంబై రైళ్లకు అదనపు బోగీలు

- కొత్త ఏడాదిలో అమలు
- రేపటి నుంచి అదనపు కోచ్‌లు
- తీరనున్న ప్రయాణికుల అవస్థలు



తాండూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ముంబై వెళ్లే ప్రయాణికులకు రైల్వేశాఖ శుభ వార్త చెప్పింది. తాండూరు మీదుగా ముంబైకి వెళ్లే రైళ్లకు అదనపు బోగీలను అమర్చనున్నట్లు ప్రకటించింది. ముంబై వెళ్లే రైళ్లలో రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వేశాఖ రేపు(గురువారం) నుంచి హైదరాబాద్(నాంపల్లి) నుంచి ముంబై(22731), ముంబై నుంచి హైదరాబాద్ (నాంపల్లి) వచ్చే రైలుకు, హైదరాబాద్(నాంపల్లి) నుంచి ముంబై(12702), ముంబై-హైదరాబాద్(నాంపల్లి) (12701) హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు జనరల్‌సెకండ్ కోచ్‌లను, స్లీపర్ కోచ్‌లను అదనంగా కలపాలని దక్షిణ మధ్య రైల్వేశాఖ నిర్ణయించింది. కరోనా తర్వాత ముంబైకి వెళ్లే రైళ్లలో కేవలం ముందు, వెనుక భాగంలో ఒక్కొక్క జనరల్ బోగీలు ఉండేవి. ఈబోగీలు హైదరాబాద్ (నాంపల్లి) రైల్వేస్టేషన్‌లోనే బెర్త్‌లన్నీ నిండిపోయి కింద కూర్చునేవారు. కాళ్లు పెట్టడానికీ స్థలం ఉండేదికాదు. మూడేళ్లుగా తాండూరు రైల్వేస్టేషన్‌కు చేరుకునే వలసకుటుంబాలు పూణె, బీవండి, ముంబై, పట్టణాలకు ఈ రైళ్లలో వెళ్లడానికి కష్టాలుపడుతూ ప్రయాణించేవారు. ఈ అదనపు కోచ్‌ల ఏర్పాటు వలన కార్మికులకు, ప్రయాణ కష్టాలు తీరనున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో దాడికి పాల్పడిన 12 మందిపై కేసు

దోమ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని గుండాల్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జరిగిన దాడిలో 12 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దోమ ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు. వీరితో పాటు మరో 40 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంతోషాన్ని విషాదంగా మార్చుకోవద్దు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అనవసరంగా ఆర్భాటాలకు పోయి సంతోషంగా జరుపుకునే నూతన సంవత్సర వేడుకలను విషాదంగా మార్చుకోవద్దని షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. రిసార్ట్స్, ఫాంహౌజ్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు నిర్వహించినా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి, రాష్, ట్రిపుల్ రైడింగ్, నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపారు. అర్ధరాత్రి రేసింగ్‌లు, బైక్ ర్యాలీలు నిషేధమని, నాకాబందీ, వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తామని తెలిపారు. వేడుకల పేరుతో ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే శిక్షలు ఉంటాయన్నారు. ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నందిగామ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు అధైర్యపడవద్దని, అండగా ఉంటానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎదిర వెంకటయ్యగౌడ్, అల్వాల వెంకటయ్యలు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికి పరిమితమయ్యారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లెల్ల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు జంగ నర్సింలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాకలి నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, సి.కృష్ణ, సుమన్, ఎదిర శ్రీకాంత్‌గౌడ్, పిట్టల రాములు, చాకలి బాల్‌రాజ్, రమేష్, వెంకటేష్, గోపాల్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తాం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతుబిడ్డగా పరిగి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు అందించడమే లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం భారతీయ వరి పరిశోధనాసంస్థ రాజేంద్రనగర్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ నేలల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్, జూరాల ప్రాజెక్టులు ఉన్న మన ప్రాంతానికి నీరు రాకపోవడంతో ఎడారిగా మారిందన్నారు. ఈ ప్రాంతానికి నీరు తీసుకురావడానికి వైఎస్సార్ హయాంలో ప్రాణహిత చేవెళ్ల ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేసినా ప్రభుత్వం మారడంతో ఆగిపోయిందన్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఉదండపూర్, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుల ద్వారా పరిగి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు ప్రసాద్‌బాబు, అరవింద్‌కుమార్, పద్మకుమారి, ఏసుదాసు, మహేందర్‌కుమార్, ఏఎంసీ చైర్మన్లు ఆంజనేయులు, పరశురాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సమయపాలన పాటించని వైద్యసిబ్బంది


ఆసుపత్రిలో డాక్టర్ కోసం ఎదురు చూస్తున్న రోగులు


ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ

శంకర్‌పల్లి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): టంగటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సమయ పాలన పాటించక పోవడంతో రోగులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది ఉదయం 9గంటలకు రావాల్సి ఉండగా.. 10.30 గంటలు దాటినా రాకపోవడంతో వైద్యకోసం వచ్చిన రోగులు అవస్థలు పడ్డారు. ఆరోగ్యకేంద్ర సిబ్బందితో పాటుగా యునాని ఆసుపత్రి డాక్టర్ మినాజుద్దీన్ ఖాన్‌తో పాటు సిబ్బంది సైతం రాకపోవడం గమనార్హం. నెల రోజుల క్రితం కలెక్టర్ నారాయణరెడ్డి శంకర్‌పల్లికి వచ్చిన సమయంలో అధికారుల్లో మార్పు రావాలని ఆదేశించినప్పటికీ అదేమీ కనిపించకపోవడం శోచనీయం. అధికారులు ఇప్పటికైనా సమయపాలన పాటించాలని రోగులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నన్ను ఎవరూ దూషించలేదు

- ప్రభుత్వ చీఫ్‌విప్ తిట్టినట్లు వచ్చిన ప్రచారం అవాస్తవం
- మైన్స్ ఏడీ సత్యనారాయణ



తాండూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి తనను దూషించినట్లు సోషల్ మీడియాలో, కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని తాండూరు మైన్స్ శాఖ ఏడీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు మహేందర్‌రెడ్డి ఎప్పుడూ ఫోన్ చేయలేదని, ఆయన ఫోన్ చేస్తే తాను ఫోన్ ఎత్తలేన్నది నిజంకాదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకూ చెప్పినట్లు వెల్లడించారు. తాండూరు మైన్స్ ఏడీగా పనిచేస్తున్న తనకు ఎలాంటి రాజకీయ ఒత్తిడిలు కానీ, ఇబ్బందులు కానీలేవని తెలిపారు. తాను బదిలీ కోసం, సెలవు కోసం ప్రయత్నిస్తున్నట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని అన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్

యాచారం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం యాచారం మండలంలోని గున్‌గల్ మోడల్ పాఠశాలలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సులో చరణ్ మాట్లాడారు. సమాజ శ్రేయస్సుకు యువత పాటు పడాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. నాయకులు విప్లవ్ కుమార్, శ్రీకాంత్, వంశీ, తరంగ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెనకు మరమ్మతులు చేయించాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ రైల్వే వంతెన మరమ్మతులు చేయించాలని పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గణేష్ మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి వినతి అందజేశారు. నగరంలోని మంత్రి నివాసంలో కలిసి సమస్యను వివరించా రు. అనేక సంవత్సరాల నుంచి వంతెనపై రోడ్డుకు కనీస మరమ్మతులకు నోచుకోక గుంతలమయమై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న గణేశ్


కొత్తూర్ : విద్యార్థులు తయారుచేసిన ఐటమ్స్‌ను తిలకిస్తున్న ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

యాచారం/కొత్తూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని, టీచర్లు చొరవ తీసుకోవాలని హెచ్ఎం వెంకటరమణ శాస్త్రి అన్నారు. యాచారం మండలం నందివనపర్తి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. ఈమేరకు హెచ్ఎం ప్రారంభించారు. విద్యార్థులు చికెన్ బిర్యానీ, డబుల్‌కామీటా, ఆలుఫ్రై, పులిహోర, మంచూరియా, నువ్వుల లడ్డు, జొన్నరొట్టె తదితర వంటకాలు తయారు చేశారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు. అలాగే ఇంటి ఆహారంతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని ఎస్‌వీఆర్ పాఠశాలలో కరస్పాండెంట్ వీరమోని దేవేందర్ ముదిరాజ్ అధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఇన్‌స్పెక్టర్ ప్రారంభించారు. ఎస్సైలు శ్రీనివాస్, మురళీగౌడ్, ఎంఈవో అంగోర్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాలపై చర్యలు తీసుకోవాలి



ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మర్రిపల్లిగూడకు చెందిన శివరాత్రి వెంకటేష్, ఎదులాబాద్‌కు చెందిన సాల్వేరు రామ్‌నాథ్‌లు మంగళవారం సాయంత్రం ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వేనెంబరు 5 పార్టు వెంచర్‌లోని ప్లాట్‌నెంబర్ 38యజమానులు బొంత వీరారెడ్డి, రాఘవేందర్‌రెడ్డిలు రోడ్డు కబ్జాచేసి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు 14అడుగుల రోడ్డును కబ్జా చేశారని తెలిపారు. 5పార్టులో నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణదారులు రోడ్లను కబ్జాచేస్తున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. రోడ్లు కబ్జాకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

న్యూఇయర్ జోష్!

● ఘనంగా నూతన సంవత్సర వేడుకలు ● భారీగా కేక్‌లు, మద్యం అమ్మకాలు



ఘట్‌కేసర్: బేకరీలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కేకులు



ధారూరు: 2025 ఆకారంలో కూర్చున్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు

పరిగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకుల అమ్మకాలకు గిరాకీ కనిపించింది. పరిగి పట్టణంలో బేకరీలు, స్వీట్ హౌజ్ వద్ద సందడి కనిపించింది. కిలో కేక్ రూ.250ల నుంచి రూ.1200 వరకు విక్రయించారు. డ్రైఫ్రూట్స్‌తో చేసిన కేక్ కిలో రూ.1200లకు విక్రయించారు. మరికొన్ని రూ.800లకు విక్రయించారు.

ఘట్‌కేసర్: నూతన సంవత్సరంకు స్వాగతం పలికేందుకు ఘట్‌కేసర్ పోచారం మున్సిపాలిటీల పరిధిలో పలుచోట్ల యువకులు భారీ ఏర్పాట్లు చేశారు. వ్యాపారులు మార్కెట్లో కేక్‌లు, రంగులను విక్రయించారు. పావు కిలో రంగును రూ.10చొప్పున విక్రయాలు చేస్తున్నారు. కేకులకు నార్మల్ కేక్ కిలో రూ.250, అరకిలో రూ.120, కూల్‌కేక్‌లు కిలో రూ.380, అరకిలో రూ.200చొప్పున విక్రయించారు. అర్ధరాత్రి వరకు యువత విందులు వినోదాల్లో మునిగితేలారు.

వినూత్నంగా న్యూ ఇయర్‌కు స్వాగతం

ధారూరు: ధారూరులోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు మంగళవారం వినూత్న పద్ధతిలో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు వెల్‌కం టూ 2025 ఆకారంలో కూర్చొని న్యూఇయార్‌కు స్వాగతం పలికారు. విద్యార్థులు ప్రదర్శించిన న్యూ ఇయర్ విన్యాసం చూపరులను ఆకర్షించింది.

కొడంగల్: నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కేక్ కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులు 'వెల్‌కం 2025' ఆకారంలో కూర్చొని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ డి.వి.నరేశ్‌రాజ్, సంతోష పాల్గొన్నారు.

గ్రాండ్ వెల్‌కమ్

(5వ పేజీ తరువాయి)

వేడుకలు నిర్వహించుకున్నారు. ఇదిలా ఉంటే, అనంతగిరి పర్యాటక కేంద్రం పర్యాటకులతో కిటకిటలాడింది. టపాసులు, బాణాసంచా, తారాజువ్వలు కాల్చి తమ సంతోషం వ్యక్తం చేశారు.

కిక్కిరిసిన మార్కెట్లు, మద్యం దుకాణాలు

ఉమ్మడి జిల్లాలోని మార్కెట్‌లు కిక్కిరిసాయి. బేకరీలు, మద్యం దుకాణాలు, రంగుల దుకాణాలు, చికెన్ సెంటర్లు ఇలా ఎక్కడ చూసినా ఇసుక వేస్తే రాలనంత జనం దుకాణాల వద్ద ఎగబడటం కనిపించింది. బేకరీ దుకాణాల నిర్వాహకులు ముందుగానే అందమైన కేకులను తయారు చేసి ప్రత్యేకంగా విక్రయానికి సిద్ధం చేశారు. అర్ధరాత్రి వరకు వేడుకలకు ప్రభుత్వం అనుమతినివ్వడంతో రోడ్లపై సందడి కనిపించింది. అలాగే కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తమ ఇళ్ల లోగిళ్లను రంగురంగుల రంగవల్లికలతో అందంగా అలంకరించారు. ఇందుకోసం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గంటల కొద్ది కష్టపడి రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు.

అర్ధరాత్రి వరకు డ్రంకెన్ డ్రైవ్

కొత్త సంవత్సరం వేడుకల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఎలాంటి అపశృతులు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఎస్పీ నారాయణరెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కులకచర్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. మండలంలోని అల్లాపూర్, ముజాహిద్‌పూర్, రాంరెడ్డిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. ఉమ్మడి మండలంలోని 44 గ్రామ పంచాయతీల్లో సర్వే కొనసాగుతుందని తెలిపారు.ఇప్పటి వరకు 55 శాతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయినట్లు ఆయన తెలిపారు. అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.

దోమ: మండలంలోని బాచుపల్లి, శివారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను మంగళవారం ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. సర్వేలో తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సాహేరా, రవి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మర్పల్లి: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు అధికారులకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రాజమల్లయ్య అన్నారు. ఆయన మర్పల్లి, కొత్లాపూర్, బూచన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో 1800కు పైగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మరో వారం రోజుల పాటు సర్వే కొనసాగుతుందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దంపతులు

తాండూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అరుణ దంపతులు మహాపడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వాముల ముత్యాలు, భక్తుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. అయ్యప్ప స్వామి సంకీర్తనలు, భజనల మధ్య పల్లకీసేవ అంగరంగ వైభవంగా జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు ఆర్బీఎల్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి సరళ దంపతులు, సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు ఎం.రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మున్సిపల్ మాజీచైర్మన్లు లక్ష్మారెడ్డి, సునీతాసంపత్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వైకుంఠఏకాదశి సందర్భంగా పరిగిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఉత్సవాలకు సంబంధించి మంగళవారం ఆలయ ఆవరణలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా నిర్వహించే కంటే ఈసారి రెట్టింపు ఏర్పాట్లతో విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో కడా ప్రత్యేకాధికారి పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బొంరాస్‌పేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లిలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్ స్థానంలో నూతన పాఠశాల భవనం కోసం అనుమతులు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. దీంతో కమ్యూనిటీహాల్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. త్వరలోనే నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా పార్వతీ పరమేశ్వర ఆలయానికి సీసీరోడ్డు, కల్యాణ మండపం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులకు తిరుప్పావై ప్రాముఖ్యతను దరూరి శ్రీనివాసాచార్యులు వివరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో..

శామీర్‌పేట: శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

4,230 కేసులు నమోదు

(5వ పేజీ తరువాయి)

పాల్పడ్డ 812 మందిని అరెస్టు చేసి రూ.18,63,745 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. 386 కేసుల్లో నిందితులకు శిక్ష పడిందని, వీరిలో అయిదు కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడిందన్నారు.

కమ్యూనిటీ పోలిసింగ్ నిర్వహణ

సైబర్ మోసాల బారిన 889 మంది రూ.4,34,25,838 కోల్పోగా, 135 కేసుల్లో రూ.29,60,915 రిఫండ్ చేశామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 964 కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గించగలిగామన్నారు. అలాగే ఆత్మహత్యలు తగ్గాయన్నారు. నేరాలను నియంత్రణలో, నేరాలను చేధించడంలో సీసీటీవీలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,841 సీసీటీవీలు ఉండగా, నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గత ఏడాది కాలంలో జిల్లాలో 545 సీసీటీవీలు కొత్తగా ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశామన్నారు.

అనుమతులు లేకపోతే చర్యలు

ఆపరేషన్ స్మైల్ ద్వారా 162 మంది , ముస్కాన్‌లో 173 మంది బాల కార్మికులను కాపాడామని, దీంట్లో 26 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అత్యాచార, పోక్సో కేసుల బాధితులకు భరోసా కేంద్రం ద్వారా రూ.14,92,500 మహిళా శిశు సంక్షేమ శాఖ విడుదల చేసిందన్నారు. జిల్లాలో నిర్వహించిన 10 కార్డన్ సెర్చ్‌లో 585 వాహనాలను సీజ్ చేసి, పత్రాల ధ్రువీకరణ తర్వాత అన్ని వాహనాలకు జరిమానా విధించామన్నారు. ఏడాది కాలంలో 31,255 డయల్ 100 కాల్స్ రాగా, వాటిలో 166 కాల్స్‌కు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, 29,733 కాల్స్ రాజీ అయ్యాయన్నారు. జిల్లాలోని రిసార్ట్ యజమానులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు.

సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రారంభించిన సీసీరోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. మున్సిపల్ పరిధిలోని 4, 10, 18, 21 వార్డుల్లో రూ.33లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.30లక్షలు మంజూరయ్యాయి. ఈ నిర్మాణ పనులకు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వైసత్యనారాయణరెడ్డిలు మంగళవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ అధికారి సిద్ధమ్మ, డైరెక్టర్లు, కమిషన్ ఏజెంట్లు పాల్గొన్నారు.

క్రీడా విభాగంలో ప్రభుత్వ ఉద్యోగాలు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 31: క్రీడా విభాగంలో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. అల్‌ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌కు నెట్‌బాల్ క్రీడాపోటీలకు కేపీఐఆర్‌టీ క్రీడాకారులు దీప్తిశ్రేయ, బన్నీయాదవ్, అనన్య రాజశేఖర్, గౌతమ్‌రాజ్‌లు ఎంపికైన సందర్భంగా మంగళవారం వారిని ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపల్స్ రవీంద్ర ఎక్లార్కర్, శ్రీనాథ్, పీడీలు రంజిత్, లివిజా పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం

మోమిన్‌పేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్రాదికుర్దులో మంగళవారం పశువైద్య, పశుసంవర్ధక శాఖ, రాష్ట్ర పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం నిర్వహించారు. పశువులకు చికిత్సలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలతో పాటు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారిణి గీత, సిబ్బంది శివరామహర్షి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్నానం చేస్తుండగా ఫొటోలు

● భర్తకు పంపిస్తామని బెదిరింపులు ● పలుమార్లు లైంగికదాడి
● చర్యలు తీసుకోవాలంటూ వివాహిత ఫిర్యాదు

కులకచర్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్నానం చేస్తుండగా ఫొటోలు తీసి తనను శారీరకంగా వాడుకొని జీవితంతో చెలగాటమాడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరికల్ గ్రామానికి చెందిన వివాహిత మహిళ(38) కొన్ని నెలల కిందట స్నానం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన నర్సింహులు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీశాడు. ఈ ఫొటోలు ఇతరులకు, నీ భర్తకు పంపిస్తామని చెప్పి భయపెట్టి ఆమెను లొంగదీసుకున్నాడు. పలుమార్లు లైంగికదాడి చేశాడని, తాను నర్సింహులుతో కలిసి ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఆనంద్ సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి తనభర్తకు, పిల్లలకు పంపించి దూరం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో తాను కొన్ని నెలలుగా తన తల్లి ఇంట్లో ఉంటున్నానని తెలిపింది. నర్సింహులు ఇక్కడికి వచ్చి తనతో కలవాలని భయపెడుతున్నాడని వాపోయింది. తనను శారీరకంగా వాడుకొని జీవితాన్ని నాశనం చేసిన ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

దోమ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దాహార్తిని తీర్చుకునేందుకు వెళ్లిన మహిళ బావిలో కాలు జారిపడి మృతి చెందింది. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పాలెపల్లికి చెందిన మంగలి పద్మమ్మ(37) జీవనోపాధి కోసం తెచ్చుకున్న మేకలను మేత కోసం గ్రామ శివారులోని పంట పొలాల దగ్గరికి తీసుకెళ్లింది. సాయంత్రం వేళలో దాహార్తిని తీర్చుకునేందుకు సమీపంలోని బావి దగ్గరికి వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబసభ్యులు బావిద్దకు వెళ్లి వెతకగా బావి గట్టుపై చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. దీంతో బావిలో జారిపడిపోయి ఉంటుందని గ్రహించి స్థానికులు మోటార్ల సాయంతో నీటికి బయటకు తీయగా పద్మమ్మ మృతదేహం కనిపించింది. మృతురాలికి ఓ కూతురు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

1100 గ్రాముల గంజాయి పట్టివేత

పరిగి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో సోమవారం రాత్రి పరిగి మండలం రూఫ్‌ఖాన్‌పేట్ గేట్ సమీపంలో 1100 గ్రాముల గంజాయి పట్టుబడినట్లు పరిగి ఎక్సైజ్ సీఐ నీరజారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బైక్‌పై వెళుతున్న దుద్యాల మండల కేంద్రానికి చెందిన నవీన్‌ను తనిఖీ చేయగా అతడి వద్ద 150 గ్రాముల ఎండు గంజాయి లభించింది. రామాంతాపూర్ నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు తెలపగా నవీన్‌తో రంగారెడ్డి జిల్లాలోని పటేల్‌నగర్ రామాంతపూర్‌కు తీసుకెళ్లి తనిఖీలు నిర్వహించారు. అక్కడ నల్గొండకు చెందిన మహేశ్ దగ్గర 950గ్రాముల ఎండు గంజాయి లభించింది. మొత్తం 1100గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇద్దరి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐలు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐలు దయాసాగర్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సుతారీ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 8 మందిపై కేసు నమోదు

పూడూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సోమన్‌గుర్తి గ్రామశివారులో సోమవారం పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి నర్సింహులు, యాదయ్య, సత్తయ్య, మల్లేష్, రాములు, యాదయ్య, చిన్నయ్య, రమేష్ అనే వ్యక్తులు పేకాడుతుండగా పట్టుకున్నారు. వారి నుంచి పేకముక్కలు, రూ.1310 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారంచోటు చేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం. కొర్రెములకు చెందిన రమేష్(45), గౌరీశంకర్‌లు ద్విచక్రవాహనంపై సోమవారం మధ్యాహ్నం ఘట్‌కేసర్‌కు నుంచి కొర్రెములకు వెళ్లుతుండగా బైక్ అదుపు తప్పి ఎరిమల్లేవాగులో పడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇద్దరిని నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రమేష్ మంగళవారం సాయంత్రం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మన్యం సుబ్రమణ్యం సేవలు మరువలేనివి



పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు, అభిమానులు

కీసర, డిసెంబరు 31 ఆంధ్రజ్యోతి: ఇటీవల అకాలంగా మరణించిన ప్రముఖ పారిశ్రామికవేత్త మన్యం సుబ్రమణ్యంకు సంతాపసభ నిర్వహించారు. గుర్రం వరకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కీసరలో నిర్వహించిన సంస్మరణ సభకు కులమతాలకు, పార్టీలకు అతీతంగా, ఆయన ద్వారాసేవలు పొందిన ప్రతీఒక్కరు స్వచ్ఛందంగా సంతాపసభలో పాల్గొన్నారు. ఈమేరకు కీసర గ్రామపంచాయతీ కార్యాలయానికి విరాళంగా రెండు ఆటోలు, అదేవిధంగా కీసరగుట్ట క్షేత్రంపై కోట్ల రూపాయాలు విలువ చేసే షెడ్డు, రాంపల్లి దాయర గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేసే కార్మికులకు వేతనాలు, ఇలా ప్రతీ ఒక్కరికి ఆర్థికంగా తనవంతు సాయం చేసిన మహనీయుడని స్మరించుకున్నారు. ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ తమ అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కందాడి హనుమంత్‌రెడ్డి, బొబ్బిలి శ్రీనాథ్‌రెడ్డి, జూపల్లి సురేందర్, రాము, జూపల్లి రవీందర్‌తో పాటు ఆయా రాజకీయ పార్టీల నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

ట్రెయినీ ఎస్ఐలకు సన్మానం



ట్రెయినీ ఎస్ఐలను సన్మానిస్తున్న బషీరాబాద్ ఎస్ఐ శంకర్, సిబ్బంది

బషీరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ముగ్గురు ట్రెయినీ ఎస్ఐలను బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. శిక్షణలో భాగంగా నెలరోజుల కిందట ఇక్కడికి వచ్చిన ట్రెయినీ ఎస్ఐలు పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తించారు. వారిని ఎస్ఐ, సిబ్బంది పూలమాల, శాలువాలతో సత్కరించారు.

జుంటుపల్లి రామస్వామి ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

యాలాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంటుపల్లి రామస్వామి ఆలయం నూతన క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. జుంటుపల్లి రామస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ ఈవో రాజేందర్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ హన్మంత్‌రావు, డాక్టర్ రవీందర్‌రావు, శ్యాంసుందర్‌రావు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్ని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

'బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా'

వికారాబాద్, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... మర్పల్లి మండలంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఇంట్లో అనుకోని పరిస్థితుల్లో అనారోగ్య సమస్యలతో ఎవరైనా చనిపోతే వారి అంత్యక్రియల కోసం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేస్తానని తెలిపారు. కొత్త సంవత్సరం నుంచి తన నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.